

[కేవలం వినోదంకోసం, కాలక్షేపం కోసం వ్రాయబడిన యీ కథలోనిపాత్రలు, సన్నివేశాలు అన్నీ ఊహాకల్పితాలు. ఎవ్వరికీ ఏవిధంగానూ సంబంధించినవి కావు-రచయిత]

హోండిపార్టుమెంటు సెక్రటేరియేట్‌లో గుణశేఖర్ ఒక జూనియర్ గుమాస్తా. ఒక రోజున తన, ఆఫీసు కాగితాలు చూసుకొంటూ, ఒక 'రిఫరెన్సు ఫైలు' కావలసి వచ్చి 'రికార్డు రూమ్' లోకి వెళ్లాడు. రికార్డుబీరువాలోనుంచి తనకు కావలసిన ఫైలు తీసుకొంటూ వుండగా, దానికిందనే వున్న మరొక ఫైలును చెదపురుగులు తినటం చూసి బేజారెత్తిపోయాడు. ఈ విషయాన్ని వెంటనే తన హెడ్‌గుమస్తాతో చెప్పాడు. హెడ్‌గుమాస్తా చెదతినేసిన ఫైలును అటూ యిటూ తిప్పి చూసి ఆవిషయం రిపోర్టు రాసి పంపమన్నాడు గుణశేఖర్‌ని. గుణశేఖర్ యిల్లా రాశాడు:

"ఇవాళ రికార్డురూమ్‌లో నా సెక్షన్‌కు సంబంధించిన కాగితాలు కొన్ని చూసుకొంటూవుండగా ఒక ఫైలుకు చెదపట్టటం చూశాను. ఈఫైలు నా సెక్షన్‌కు రిఫరెన్సు కోసం యిదివరలోనే నాదగ్గరికి వచ్చింది. రికార్డులను జాగ్రత్త చేయటానికి రికార్డు గుమాస్తా వేరేవున్నాడు.

గుణశేఖర్.
8-8-52
క్లార్క్."

రికార్డు గుమాస్తాను కూడా సంజాయిషీ యివ్వమనటంవల్ల యిల్లా రాశాడు అతను-

"నేను రికార్డు రూమ్ పర్యవేక్షణలోనే వున్నాను. కాని, చెదపురుగులు ఆ బీరువాలో ప్రవేశించటం సంగతి నాకు యింతవరకూ తెలియనే లేదు. రికార్డు బీరువాలన్నీ ఎప్పుడూ శుభ్రంగానే వుంచటంవల్ల, తలుపులన్నీ గట్టిగా తాళాలు వేయటంవల్ల. యీ చెదపురుగులు బీరువాలోకి ఎల్లా ప్రవేశించాయో నేనేమి చెప్పలేను.

చంద్రమౌళి
9-8-52
రికార్డు కీపర్."

హెడ్ గుమాస్తా యీ యిద్దరి గుమాస్తాల సంజాయిషీలను కలిపి, ఆఫీసు సూపరింటెండెంటుగారికి పంపి తన విధిని నిర్వర్తించారు.

"ఎకౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాలు చెదపురుగులు తినేశాయి. గుమాస్తాల సంజాయిషీలు తీసుకొన్నాను. తరువాత తీసుకోవలసిన చర్య వివరించవలసినది:

ప్రసాద్
18.8.52
హెడ్ క్లార్క్."

ఆఫీసు సూపరింటెండెంటుగారు ఈ కాగితాలు చూసి యీ విషయం డిప్యూటీ సెక్రటరీగారికి తెలియటం చాలా అవసరమనుకొన్నారు. ఇల్లా రాసి ఆయన బాధ్యత తీరవేర్చారు.

"ఎకౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాలు చెదపురుగులు తినేశాయి. గుమాస్తాల సంజాయిషీలతో పంపడమైనది. తగినచర్య ఆర్డరు వేయవలసినది.

రామ్‌చంద్ భట్టాచార్.
20.8.52
ఆఫీసు సూపరింటెండెంటు."

డిప్యూటీ సెక్రటరీగారు వీరైనంత తొందర

# ★ ఆఫీసర్లు ★

రలో యీ ఫైలును చూసి యిల్లా ఆర్డరు వేశారు:—

“ఇందులో బాధ్యులైన గుమాస్తాలను వెంటనే ‘సస్పెండు’ చేసి ‘చార్జస్ ఫ్రేమ్’ చెయ్యండి. విచారణచేసి వివరాలు నాకు తెలియపర్చండి. ఎన్ని చెదపురుగులు రికార్డు రూమ్‌లోకి వెళ్ళాయి? ఇంతవరకు ఎన్ని ఫైల్సు పాడుచేశాయి! ఇంకా ఎన్ని ఫైల్సు పాడుచేయగలవు?

ఎస్. ఆర్. జగన్.
18.10.52
డిప్యూటీ సెక్రటరి.”

ఫైలుకిందకు దిగటం ఆరంభమయింది. ఆఫీసు సూపరింటెండెంటుగారు ఫైలును హెడ్ గుమాస్తాకు పంపుతూ యిల్లా రాశారు:—

“డిప్యూటీ సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం చేయవలసినది. పాడైనదానిని బాగు చేయించటానికి ఎంతడబ్బు ఖర్చుఅవుతుంది? ఎంతకాలం పడుతుంది?

రామ్‌చంద్ భట్టారకా
30-10-52
ఆఫీసు సూపరింటెండెంటు.”

హెడ్‌గుమాస్తా, డిప్యూటీ సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం గుణశేఖర్‌ని, చంద్రమౌళిని సస్పెండు చేశాడు. చెదపురుగులను లెక్కకట్టటానికి రోజుకూలి పద్ధతిమీద రెండువారాలపాటు ఒకరిని ఏర్పాటు చేశాడు. తర్వాత రిపోర్టు యిలా రాశాడు:-

“డిప్యూటి సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం, క్లార్కు గుణశేఖర్‌ని, రికార్డుకీపరు చంద్రమౌళిని 1-11-52 నుంచి సస్పెండు చేశాను. రెండువారాలపాటు రోజు 1కి రు. 3-8-0 చొ॥న రోజుకూలి పద్ధతిమీద మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ అనే అతనిని చెదపురుగులను లెక్కకట్టటానికి నియమించాను — అవీరువాలో 396 బతికినవి — 28 చచ్చిపోయినవి — చెదపురుగులు వున్నాయి. ఇంతవరకు ఒక ఫైలుమాత్రమే తినేశాయి. ఈ చెదపురుగులు అన్నీ కలిసి రికార్డురూమ్ ఫైల్సు అన్నీ పాడుచెయ్యాలనుకొంటే పాడు చేయగలశక్తి గలవి. పాడైన ఫైలును బాగుచేయటానికి, నలుగురు గుమాస్తాలను ప్రత్యేకంగా యీ పనికి వినియోగిస్తే మూడు నెలరోజులలో యీ పని నిర్వర్తించగలరు. మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ జీతము రు. 49-0-0 మంజూరు కోరవలసినది.

ప్రసాద్
18-11-52
హెడ్ క్లార్కు.”

ఆఫీసు సూపరింటెండెంటుగారు హెడ్ గుమాస్తా రిపోర్టు చూసి, డిప్యూటీ సెక్రటరిగారికి పంపుతూ యిల్లా రాశారు.

“ఈ విషయంలో తగిన చర్య హెడ్ గుమాస్తా తీసుకొన్నాడు. చిల్లర ఖర్చుల కింద రు. 49-0-0 మంజూరు చేయవలసినది. ఈ డబ్బు తాత్కాలికంగా నియమింపబడిన మహమ్మద్ అబ్దుల్ రహిమాన్‌కు యివ్వాలి.

రామ్‌చంద్ భట్టారకా.
28-11-52
ఆఫీసు సూపరింటెండెంటు.”



పూర్వీకుల తలపాగా పద్ధతులు

చిత్రాలు: చెరుకూరి గురవయ్యనాయుడు.



డిప్యూటి సెక్రటరిగారు యీ ఫైలు నంతా చాలా జాగ్రత్తగా చదివి చూశారు. ఇంతవరకు యీ విషయం సెక్రటరీగారికి తెలియకపోవటం చాలా పొరపాటయిందను కొన్నారు. వెంటనే ఫైలును సెక్రటరీగారికి పంపుతూ యిల్లా రాశారు:

“కొద్ది రోజులకిందట ఎకౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాల్ని చెద పురుగులు తినేశాయి. ఒక విచారణకూడా చేయించాను. ఈ చెదపురుగులు ఏదారిగుండా బీరువాలోకి ప్రవేశించాయో ఎవరికీ తెలియదు కాబట్టి యిందుకు బాధ్యులు ఎవరో నిర్ణయించలేం! మన సిబ్బంది చెద పురుగుల విషయంలో తర్ఫీదు పొందినవారు కాకపోవటంచేత యీ విషయంలో యింతకన్నా వివరాలు రాయటం సాధ్యంకాదు.

ఎస్. ఆర్. జగన్.
20-12-52
డిప్యూటి సెక్రటరి.”

సెక్రటరీగారి దగ్గరకి వందలకొద్దీ ఫైల్సు వస్తాయి-దురదృష్టవశాత్తు యీ ఫైలు “అర్జంటు” మార్కు వేయించుకోకుండా వెళ్ళిపోయింది. అందుచేత నాలుగు నెలల దాకా దీనిమీద దృష్టి పడలేదు. సెక్రటరీగారికి ఫైలంతా చదివిచూసి యిల్లా రాశారు:

“ఎంక్వయిరీ పూర్తిగాలేదు. చెద పురుగులు-రికార్డురూమ్‌లోకి ఎల్లా వచ్చాయి? ఇంకా ఏయే జంతువులు రికార్డు రూమ్‌లోకి రావటానికి అవకాశముంది.?

డబ్ల్యు. జె. జార్జి బ్రూక్.
26-4-53
సెక్రటరి.

ఫైలు మళ్ళీ కిందకు దిగింది. వరసక్రమంగా- హెడ్ గుమాస్తాని వారం రోజులలో రిపోర్టు పంపాలన్నారు.

చెదపురుగులు రికార్డు రూమ్‌లోకి ఎల్లా వచ్చాయో తెలుసుకొనేందుకు విశ్వ ప్రయత్నం చేశాడు హెడ్ గుమాస్తా. కాని ఫలించలేదు. చివరకి యిల్లా రాశాడు...

“ఇందుకు ఎవరు బాధ్యులో, ఎల్లా యీ చెదపురుగులు బీరువాలో ప్రవేశించాయో ఎవరూ చెప్పలేరు.

పాలీళ్ళు, బల్లులు, ఎలుకలు, మిడతలు, పిచ్చుకలు, పావురాలు, కుక్కలు, నక్కలు మొదలైనవి కూడా రికార్డు రూమ్‌లోకి

రావటానికి అవకాశాలున్నాయి. లోపలికి రాకూడదనే ఉత్తరువును ఉల్లంఘించి, ఓండ్రపెడుతూ ఓ గాడిద కూడా రికార్డు రూమ్ లోకివచ్చింది ఒకరోజున. కాని మన గుమాస్తాలు, చాలా సామర్థ్యంతోను తెలివితోను దానిని బయటికి పంపించేశారు!

ప్రసాద్.
15-5-53,
హెడ్ క్లార్క్."

ఫైలు మళ్లీ పైకి వెళ్లటం ఆరంభమయింది. కాని యీసారి అదృష్టవశాతూ సెక్రటరీ గారి దృష్టి తొందరగానే పడింది.

పరిస్థితి అంతా ఆమూలాగ్రంగా ఆలోచించి యీ విషయం మంత్రిగారికి తెలియకపోతే ఏదో పెద్ద "డేంజరు" సంభవిస్తుందని భావించి, ఫైలును మంత్రి గారి దగ్గరకి పంపుతూ యిల్లా రాశారు:—

"అతి ముఖ్యం! గౌరవనీయులైన మంత్రి గారు పరీక్షించాలి! డిప్యూటీ సెక్రటరి అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. ఆఫీసు రికార్డులు ఏ విధంగాను కూడా పాడైపోకుండా వుండటానికి తగిన రక్షణ చేయాలనేది నిస్సందేహం. ప్రస్తుతం అర్జంటుగా మూడు డజనులు చెదపురుగులను తినే కాజా పిట్టలను కొనటం మంచిది. అంగువల్ల రికార్డు రూమ్‌లో ప్రస్తుతం స్థావరం ఏర్పరచుకొన్న చెదపురుగులు నశించిపోతాయి. లేదా కొన్ని చెదపురుగులనుపట్టి, క్రిమికీటకాది పరిశోధనాలయ డైరక్టరుకు పంపి వాటిని అంతరింపచేసే మార్గం తెలుసుకోవచ్చు!

ఈ ఖర్చుకు మీరు అంగీకరించగలిగితే డబ్బుకోసం ఆర్థికశాఖను మంజూరు కోరగలము.

డబ్ల్యు కె. జార్జిబ్రూక్.
24-7-53.
"సెక్రటరి."

గౌరవనీయులైన మంత్రిగారికి అసలు తీరుబడేవుండదు! ఆయన పార్టీపని—ఆ పార్టీ సిద్ధాంతాలు, ఉపన్యాసాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనోత్సవాలు, ఎగిబిషనులు, సినిమాల శతదినోత్సవాలు, మళ్లీ వచ్చే ఎన్నికలనాటికి తన పదవికోసం ప్రచారం—ఒకటేమిటి — యిల్లాగే ఆయనకు ఎన్నో పనులు! ఆఫీసుఫైల్సు చూడటానికి ఆయనకు తీరుబడి ఎక్కడ వుంటుంది?

ఆర్నెల్లతరువాత "మన" ఫైలుకు మంత్రి గారు చూడగలిగే భాగ్యం లభించింది!

ఆయన ఒక్కటే వాక్యం రాసిపంపేశారు సెక్రటరీకి—స్వయంగావచ్చి మాట్లాడవలసినది.

రాజామార్గబంధు
10-1-54.
"హోంమంత్రి."

సెక్రటరీ యీ విషయాన్ని మాట్లాడటానికి వచ్చినప్పుడు మంత్రిగారు నరసింహావతారం దాల్చారు.

'మన ఆఫీసు రికార్డులు చిత్తుకాగితాలు కాదని నీకు తెలుసు! మన డిపారుమెంటు చరిత్రాత్మకంగా ఎంత ముఖ్యమయింది? మనం యిక్కడ నిద్రపోతూంటే, పురుగులు, జంతువులూ రికార్డులను తినేస్తూంటే దేశానికి ఎంత నష్టం సంభవిస్తుంది? నా ఉద్దేశ్యంలో ఇదంతా నా ప్రతిపక్షం తెచ్చే ఒక రాజకీయ విప్లవం! నా డిపార్టుమెంటు వ్యవహారాలన్నీ పాడుచేసి నన్ను అవమానం చేయటానికి పన్నిన కుట్ర యిది! పోలీస్ యిన్‌స్పెక్టర్ జనరల్‌కు యీ విషయాన్ని వెంటనే తెలియపర్చి నలుగురు సి. ఐ. డి లను నియమించి, విచారణ చేయించి రిపోర్టు పంపమను.

నెక్స్ట్ — అఫీషియల్‌గా విచారణ చేయటానికి హెడ్‌గుమాస్తా ఏం పని కొసాడు! నాన్సెన్స్! వెంటనే ఒక కమిటీని నియమించి తరవాత మాట్లాడు వెళ్లు! ముందు. అర్జంటుగా యీ పని చూడు!"

మంత్రిగారు చెప్పినట్లు ఆర్డర్లు జారీ చేశాడు సెక్రటరి:

"తక్షణం మూడు డజనుల కాజా పిట్టలను కొనండి. ఈ ఖర్చు, తాత్కాలికంగా నియమింపబడిన మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ జీతమూ-హెచ్. ఆర్. యం. యస్-హోం డిపారుమెంటు-రికార్డులు-చిల్లర ఖర్చులు-కొత్తక్రింద వ్రాసి-ఆర్థిక శాఖను మంజూరు కోరండి. కాజా పిట్టలను రికార్డురూమ్‌లో వదలి, తలుపులన్నీ మూసివేసి, లోపలకు ఎవరూ వెళ్ళకుండా, రికార్డు రూమ్ సీలు చేయండి!

కాజాపిట్టల పెంపకాన్ని గురించి చదివేందుకు ఒక గుమాస్తాను ఆస్ట్రేలియాకు, చెదపురుగుల నాశనానికి 'క్రిమిసంహార శాస్త్రం' చదివేందుకు మరొక గుమాస్తాను అమెరికాకు పంపించండి! గుమాస్తాల పేర్లు సెలెక్టు చేసి పంపవలసినది—అర్జెంట్!

డబ్ల్యు. కె. జార్జిబ్రూక్
22-1-54
సెక్రటరి"

పోలీస్ ఇన్‌స్పెక్టరు జనరల్ యీ విషయంలో దర్యాప్తు చేయటానికి నలుగురు సి. ఐ. డి. లను నియమించాడు. విదేశాల నిపుణులను పిలిపించి అఫీషియల్ కమిటీని నియమించటానికి శాసనసభ అనుమతి తీసుకొన్నారు. విదేశనిపుణులకుఆహ్వానాలు పంపబడ్డాయి. ఆస్ట్రేలియానుంచి ఒకరిని, చైనానుంచి ఒకరిని, రష్యానుంచి ఒకరిని, అమెరికానుంచి ఒకరిని-పిలిపించారు.

ఈలోపుగా పెద్ద అల్లరి చెలరేగింది. ప్రభుత్వం చేస్తూన్న యీ ప్రయోజనాత్మక కార్యాన్ని అమాయక ప్రజలు అర్థం చేసుకోలేకపోయారు. ఈ వార్త పత్రికాలయాలకు కూడా దారితీసింది. పెద్ద పెద్ద అక్షరాలతో పత్రికలు ఘోషించాయి. సస్పెన్షన్‌లో పెట్టబడిన గుమాస్తాలు హైకోర్టులోదావాచేశారు. ప్రభుత్వంమీద న్యాయమూర్తులైన "జస్టిస్ రెట్", జస్టిస్ ఫైర్"లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెబుతూ, ఆ గుమాస్తాలను వెంటనే ఉద్యోగాలలో చేర్చుకోవాలని, యిన్నాళ్ళనుంచీ ఆపుచేసినవాళ్ళ జీతాలు వెంటనే యిచ్చివేయాలని ఉత్తర్వు జారీచేశారు.




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన దర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగటా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

# ఆఫీసర్లు

మంత్రిగారికి మతిలో మతిలేదు! ఆయన వెంటనే పత్రికాప్రతినిధుల సమావేశం ఏర్పరచి తన ఆఫీసర్లు చేసిన పని సమర్థించారు. పత్రికా విలేఖరులు, మంత్రిగారు చెప్పిన దానిమీదకన్నా, ఆయన యిచ్చిన ఫలహారపానీయాలమీద ఎక్కువగా శ్రద్ధ చూపించారు.

శాసనసభలో ప్రతిపక్షసభ్యులు యిటువంటి సంఘటనలకోసం ఎప్పుడూ కాసుకొని కూర్చొంటారు!

ఒక రోజు సమావేశంలో, ప్రశ్నోత్తర సమయంలో ప్రతిపక్ష సభ్యులు మంత్రిగారిని, నిర్దాక్షిణ్యంగా అవస్థపెట్టేశారు.

"ఖచ్చితంగా ఎన్ని ఫైల్సు పాడయిపోయాయి? అవి బాగుచేయించటానికి ఎంత డబ్బు ఖర్చుఅయింది"—ఒక సభ్యుడు అడిగాడు.

"ప్రజాశ్రేయస్సుదృష్ట్యా యింతకు సమాధానం చెప్పలేను" మంత్రిగారిజవాబు.

"అందుకు బాధ్యులైన వారిమీద ప్రభుత్వం చర్యతీసుకోందా?"-యింకో సభ్యుడుఅడిగాడు.

"ప్రభుత్వం తీసుకొన్న చర్య ప్రజలకు యిదివరకే తెలుసు"—మంత్రిగారు జవాబిచ్చారు.

"అసలు యీ చెదపురుగులు ఎక్కణ్ణించి వచ్చాయి?" మరో సభ్యుడడిగాడు.

"అందుకనే-యీ విషయాన్ని అమూలాగ్రంగా పరిశీలించేందుకే ఒక కమిటీని నియమిస్తున్నాం"—మంత్రిగారు విసుగ్గా సమాధానమిచ్చారు.

"ఇటువంటి పిచ్చిపనులు యింకేమైనా కూడా కమిటీకి చెప్పదలచుకొన్నారా?" యింకో సభ్యుడు అడిగాడు.

ఇది విని సభలోని సభ్యులందరూ గొల్లున నవ్వారు. మంత్రిగారు మాట్లాడలేదు—

"ఇతర డిపార్టుమెంటులలో కూడా యిటువంటివి జరుగుతున్నాయా?" మరో సభ్యుడు అడిగాడు.

"సమాధానానికి అవకాశం కావాలి" అన్నారు మంత్రిగారు.

అంతటితో ఆ నాటికి సభ ముగిసింది.

విదేశ నిపుణులు, భారతదేశానికి వచ్చి, ముందు తీరుబడిగా, యాత్రాస్థలాలు, చరిత్రాత్మకప్రదేశాలు, చూస్తూ ఒక నెల విశ్రాంతి తీసుకొన్నారు. ఆ తర్వాత అఫీసుకు వచ్చారు. గుమాస్తాలతోనూ, ఆఫీసర్లతోనూ, చర్చలు జరిపి, కొన్ని ఫొటోలు తీసుకొని, ఆఫీసుచుట్టూ కొంత మట్టి శాంపిల్సుకూడా తీసుకొని, చివరకి ఒక వేసవి విడిదికివెళ్ళి కూర్చొన్నారు వారి రిపోర్టు వ్రాయటానికి.

మొదట్లో అమెరికానిపుణుడు, రష్యానిపుణుడు కొన్ని విషయాలలో ఏకీభవించలేదు. వారిద్దరూ ఏకీభవించేటప్పటికి రిపోర్టు చాలా ఆలస్యమయిపోయింది. చిట్టచివరకి వారు 30-10-54 నాటికి రిపోర్టు ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రభుత్వం వాళ్ళకి కృతజ్ఞత తెల్పుతూ సాధారణ ఖర్చులకింద వాళ్ళకి కేవలం నాలుగులక్షలుమాత్రం సమర్పించుకొంది.

వాళ్ళు కూడా భారతీయుల ఉదార స్వభావాన్ని మెచ్చుకొంటూ వారి వారి దేశాలకు వెళ్ళిపోయారు.

ఆ నిపుణుల కమిటీవారు వారి రిపోర్టులో యిల్లా రాశారు:



అక్క - చెల్లెలు

—ఫోటో: ఎ. కె. ఎస్. రావు, కలకత్తా.

1. ఈ వూరు వాతావరణంవల్ల చెదపురుగులు యిక్కడ చాలా ఎక్కువగా వుత్పత్తి అవుతాయి. అందుచేత రికార్డురూమ్‌లో వున్న రికార్డులన్నీ యిక్కడికి కనీసం 200 మైళ్ళ దూరంలో వున్న మరోక వూరుకు వెంటనే మార్చివేయాలి.

2. కొత్త రికార్డురూమ్‌లో గాలిచొరని యినుపబీరువా లుంచాలి. వారానికి ఒకసారి రికార్డురూమ్ అంతా క్రిమినాశకపదార్థాలతో "స్ప్రే" చేయిస్తూవుండాలి.

3. ప్రస్తుతం వున్నగదికూడా రికార్డ్ రూమ్‌కు పనికిరాదు. ఎందుచేతంటే అది తూర్పువైపువుంది. రికార్డురూమ్‌లు ఎప్పుడూ పశ్చిమంవైపే వుండాలి!

4. ప్రస్తుతపుఆఫీసు భవనం కూడా పనికిరాదు. ఎందుచేతంటే యిందులో కర్రస్తంభాలు కర్రదూలాలే వున్నాయి. రాతి కట్టడం వుండటం మంచిది.

5. ఇక్కడ నేల చెదపురుగులు పెరగటానికి చాలా అనుకూలంగా వుంది.

ఈ రిపోర్టు, చదివింతర్వాత, కొత్త భవనం కట్టించి, రికార్డులను మరోక వూరు మార్చటానికి నిశ్చయించింది ప్రభుత్వం.

కొత్త భవనము రెండేళ్ళలోనే అంటే 18-11-56 నాటికి తయారవటానికి, ఖర్చు కూడా చాలా తక్కువగానే అయిదు లక్షలయింది!

ఇదివరలో సస్పెండు చేయబడిన గుమాస్తాలను మళ్ళీ ఉద్యోగాలలో చేర్చుకోవలసి వుండటంచేత వారి జీతాల కింద 18,000 మాత్రం యివ్వవలసి వచ్చింది!

విదేశాలకు పంపబడినగుమాస్తాల కింద యాభైవేలు మాత్రం ఖర్చు చేసింది ప్రభుత్వం!

ఆ కొత్త భవనాన్ని తెరవటానికి ఒక మహారాజాగార్ని రప్పించి, వారి సన్మానానికి పదివేలు మాత్రం ఖర్చుచేసింది ప్రభుత్వం!

పాతవూరునుంచి కొత్తవూరుకు రికార్డులను మార్చమని ఉత్తరువు జారీ చేసింది. ప్రభుత్వం ఇదివరలో సెక్రటరీగారి ఆర్డరు ప్రకారం కౌజు పిట్టలను అందులో వదలి సీలుచేసిన రికార్డు రూమ్ ఆనాడు తెరచిచూసేసరికి ఆఫీసర్లందరూ తెల్లబోయారు!

అందులో మూడు డజనుల కౌజు పిట్టల ఎముకల గూళ్ళు తప్ప యింకేమిలేవు! ఇదివరలో ఆగదిలోనే స్థావరం ఏర్పరచుకొన్న చెదపురుగులు తమ జాతిని బాగా అభివృద్ధి చేసుకొని ఆ గదిలోవున్న రికార్డులన్నింటినీ తినేయటంతోటే వదలకుండా బీరువాలను కూడా తినేశాయి.

ఇంత తతంగానికి, నూతన భవన నిర్మాణానికి కారణభూతమైన "మత" ఫైలు అసలు హోండిపార్టుమెంటుకు సంబంధించినదే కాదని, ఆడిపారుమెంటుకు ఒక రిఫరెన్సుకోసం మరోకడిపార్టుమెంటు నుంచి వచ్చిందనీ, దానిని చించివేయ వలసినదిగా ఏనాడో ఆర్డరు వేయబడిందని తేలింది ఆనాడు! ★